సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 8 । జనవరి । 2023



చీనీ టన్ను రూ.30 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి. మార్కెట్‌కు 15 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.8
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.2.50 చొప్పున పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
31.3°/12.6°

శనివారం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలి తీవ్రత పెరిగింది. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

అంగన్‌వాడీలు బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, చిత్రంలో ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్లు నాగలక్ష్మి, బసంత్‌కుమార్



జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

- రాష్ట్ర వ్యాప్తంగా బాలామృతం ప్లస్ అమలు
- అంగన్‌వాడీ కేంద్రాల అద్దెల పెంపునకు చర్యలు
- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ వెల్లడి
- వాడీవేడిగా ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

అనంతపురం సిటీ: అంగన్‌వాడీలను మరింత బలోపేతం చేస్తామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల్లో బాధ్యత పెంచి, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం బాలామృతం ప్లస్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని ప్రకటించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన శనివారం జరిగింది. ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్ రెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి (అనంతపురం), శ్రీధర్‌రెడ్డి (పుట్టపర్తి), అనంతపురం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, అనంత జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్లు, జెడ్పీటీసీ, కో- ఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు హాజరయ్యారు. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయం, గృహ నిర్మాణం, ఇంజినీరింగ్ శాఖలపై చర్చ జరిగింది. పలు అంశాలపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు.

అంగన్‌వాడీల పనితీరుపై ధ్వజం

అంగన్‌వాడీ కార్యకర్తలు కొందరు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యులు మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కాంట్రాక్టర్లు నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. తమ మండలంలో కొందరు కార్యకర్తలు 12 గంటల వరకు ఉండి, ఆ తరువాత ఆయాలకు బాధ్యత అప్పగించి ఇళ్లకు వెళ్లిపోతున్నారని బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్ ఆరోపించారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని బెళుగుప్ప జెడ్పీటీసీ సభ్యురాలు మమత కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలపై సూపర్‌వైజర్ల పర్యవేక్షణ కొరవడిందని చిలమత్తూరు జెడ్పీటీసీ సభ్యురాలు అనూష ధ్వజమెత్తారు. రక్తహీనతతో అమ్మాయిలు, గర్భిణులు, బాలింతలు నరకయాతన అనుభవిస్తున్నారని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ వివరించారు. ఈ అంశాలన్నింటిపై మంత్రి ఉషశ్రీచరణ్ స్పందించారు. ఏజెన్సీ ప్రాంతాలకే పరిమితమైన బాలామృతం ప్లస్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు లేని చోట కొత్త కేంద్రాల ఏర్పాటుతో పాటు పక్కా భవనాలు కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల అద్దెను సైతం పెంచనున్నట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలకూ ముఖ హాజరు తప్పనిసరి చేస్తున్నామని తెలిపారు.

వైద్యుల పనితీరుపై ఆగ్రహం

పీహెచ్‌సీల్లో పని చేసే వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని సభ్యులు ఆరోపించారు. ఓబుళదేవరచెరువు పీహెచ్‌సీ భవనం దుస్థితికి చేరుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు ఉంట్ల దామోదర్‌రెడ్డి తెలిపారు. అనంతపురం జీజీహెచ్‌లో కొందరు ఉద్యోగులు రోగులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని నార్పల జెడ్పీటీసీ సభ్యురాలు నాగరత్నమ్మ తెలిపారు. పీహెచ్‌సీల్లో అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమేయం లేకుండా పనులు చేయడం ఎంత వరకు సమంజసమని లేపాక్షి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి నిలదీశారు. ఆస్పత్రుల్లో డాక్టర్లు పత్తా లేకుండాపోయారని కణేకల్లు జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి తెలిపారు. పీహెచ్‌సీ నిర్మాణానికి రూ.1.65 కోట్లు మంజూరైనా, పనులు పిల్లర్లకే పరిమితమయ్యాయని రొద్దం ఎంపీపీ చంద్రశేఖర్ ఆరోపించారు. అమడగూరు, మహమ్మదాబాద్ పశువైద్యశాలలకు డాక్టర్లను నియమించాలని జెడ్పీటీసీ సభ్యురాలు కవిత విజ్ఞప్తి చేశారు. పంట నష్ట పరిహారం రాని వారికి న్యాయం చేయాలని పుట్లూరు జెడ్పీటీసీ సభ్యురాలు సువర్ణ కోరారు. కొందరు లబ్ధిదారులు పట్టాలు అమ్ముకుంటున్నారని, గడువులోగా ఇళ్లు కట్టుకోకపోతే రద్దు చేస్తామని నోటీసులు ఇవ్వాలని లేపాక్షి జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి సూచించారు. వ్యవసాయ, ఇంజినీరింగ్ శాఖలపైనా చర్చ జరిగింది.

మరణాలు ఆందోళనకరం

మాతా శిశు మరణాలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతోంది. అయినా ఉమ్మడి జిల్లాలో ఇంకా మాతా శిశు మరణాలు కొనసాగుతుండడం ఆందోళనకరం. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి. పిల్లల ఇమ్యునైజేషన్ కార్యక్రమం కోసం అవసరమైన వ్యాక్సినేషన్ క్యారియర్లు అందుబాటులో ఉంచాలి.

– వెన్నపూస గోపాల్‌రెడ్డి, ప్రభుత్వ విప్

రెయిన్‌గన్లపై విచారణ చేయాలి



టీడీపీ హయాంలో కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన రెయిన్‌గన్లు దుర్వినియోగమయ్యాయి. అవి ఎక్కడున్నాయో ఎవరికీ తెలియడం లేదు. ఉన్నాయా, పాడయ్యాయా ఏదో ఒకటి తేల్చాలి. ప్రత్యేక కమిటీతో విచారణ చేయిస్తే మంచిది.

– గోరంట్ల మాధవ్, ఎంపీ, హిందూపురం

విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

పాలనలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఉద్యోగుల్లోనూ బాధ్యతను మరింత పెంచేలా ఫేషియల్ అటెండెన్స్‌ను అన్ని శాఖల్లో అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. అటెండర్ అయినా, కలెక్టర్ అయినా ఫేషియల్ అటెండెన్స్ పాటించాల్సిందే. నెల రోజుల్లో అన్ని శాఖల ఉద్యోగుల్లో మార్పు గమనిస్తారు. సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై ప్రతి వారం జరిగే ఉన్నత స్థాయి సమీక్షలు సత్ఫలితాలనివ్వనున్నాయి. క్షేత్రస్థాయిలో జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు దోహద పడుతున్నాయి.

– బసంత్‌కుమార్, కలెక్టర్, శ్రీసత్యసాయి జిల్లా

తీర్మానాలు

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రధానంగా మూడు అంశాలను సభ్యుల అనుమతి కోసం ప్రతిపాదించారు. అందులో మూడు రాజధానులకు మద్దతు, మిగులు బడ్జెట్‌లో ఆర్‌ఓ ప్లాంట్ల నిర్మాణం, జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని పాడుబడిన భవనాలను కూల్చివేసి, వాటి స్థానంలో షాపింగ్ మాల్ నిర్మించేలా చేసిన ప్రతిపాదనలను సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

ప్రాధాన్యాన్ని బట్టి నిధుల కేటాయింపు

ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన సమస్యలు ఉన్నాయి. అయితే నిధుల కేటాయింపు విషయంలో రెండు జిల్లాలకూ సమ ప్రాధాన్యం ఇస్తున్నాం. సమస్యలు ఎక్కడైతే ఎక్కువగా ఉన్నాయో ఆయా ప్రాంతాలకు కొంచెం ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాల్సి వస్తోంది. నిధులు చాలవనుకుంటే మీరు రండి (పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని ఉద్దేశించి). నేనూ మీ వెంట వస్తా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలుద్దాం. మరిన్ని నిధులు కావాలని అడుగుదాం. ఆ విధంగా నిధులు తెచ్చుకొని మరింత అభివృద్ధి సాధించుకుందాం.

– బోయ గిరిజమ్మ, చైర్‌పర్సన్, జిల్లా పరిషత్

అపోహలు తొలగించండి



జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకునే లబ్ధిదారుల్లో బిల్లులు రావనే అనుమానాలు ఉన్నాయి. సాంకేతిక సమస్యలు ప్రధాన అడ్డంకిగా మారినట్లు తెలిసింది. ప్రజల్లోని అపోహలు తొలగించి, వారిలో చైతన్యం తేవాలి. అంటు మిద్దెలు కట్టుకున్న వారికీ బిల్లుల చెల్లింపులో ఉన్న అడ్డంకులు, ఇబ్బందులు తొలగిస్తే చాలా మంది ముందుకొస్తారు. జెడ్పీ నిధులను ఏ జిల్లాకు ఎంత కేటాయిస్తున్నారో తెలపాలి. రెండు జిల్లాలకు సమానంగా ఉండాలి.

– శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే, పుట్టపర్తి

వైద్యులపై చర్యలు తీసుకోవాలి



విధులకు గైర్హాజరవుతూ, అందుబాటులో లేకుండా పోతున్న వైద్యాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇప్పటి వరకు ఏయే డాక్టర్లు అందుబాటులో లేరు, వారు ఎన్ని నెలలుగా విధులకు రావడం లేదో తేల్చాలి. అద్దె గదుల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె పెంచుతున్నట్లు తెలపడం సంతోషం. అంగన్‌వాడీ కేంద్రాలన్నీ సొంత భవనాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటే మంచిది.

– అనంత వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే, అనంతపురం అర్బన్

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ ఉద్యోగాలకు 213 దరఖాస్తులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని ఖాళీగా ఉన్న 110 అంగన్‌వాడీ ఉద్యోగాలకు 213 దరఖాస్తులు వచ్చినట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీకుమారి తెలిపారు. సీకేపల్లి, ధర్మవరం, హిందూపురం, కదిరి ఈస్ట్, కదిరి వెస్ట్, మడకశిర, పెనుకొండ తదితర 7 ప్రాజెక్టుల్లోని 30 అంగన్‌వాడీ, 16 మినీ కార్యకర్తలు, 64 సహాయకుల పోస్టుల భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. దరఖాస్తుకు ఈనెల 6వ తేదీ (శుక్రవారం) చివరి రోజు కాగా, 213 దరఖాస్తులు అందినట్లు పీడీ వెల్లడించారు. ఇందులో అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యోగాలకు 84, మినీ కార్యకర్తల ఉద్యోగాలకు 47, సహాయకుల ఉద్యోగాలకు 82 కలిపి మొత్తం 213 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

వీఆర్‌కు సీఐ ఇస్మాయిల్

హిందూపురం: 'పురం' వన్‌టౌన్ సీఐ ఇస్మాయిల్‌ను వీఆర్‌కు పంపుతూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్‌గా టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇస్మాయిల్ 2021 నవంబర్‌లో వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. కొన్ని కేసుల దర్యాప్తులో వ్యక్తిగతంగా వ్యవరించారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆయనపై చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

పిల్లలను పట్టించుకునే తీరిక లేదా?

- తుమ్మలబైలు పాఠశాల ఉపాధ్యాయులపై ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఆగ్రహం..ముగ్గురికి మెమోలు




పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులను విచారిస్తున్న మీనాక్షి

గాండ్లపెంట: 'పాఠశాలలో ఉండాల్సిన పిల్లలు ఓ రాజకీయ కార్యక్రమానికి వెళ్తుంటే మీరంతా ఏం చేస్తున్నారు... పిల్లలను పట్టించుకునే తీరిక కూడా మీకు లేదా..?, రాజకీయ నాయకులు పిల్లలను తీసుకెళ్తుంటే మీరంతా ఏం చేస్తున్నారు'' అంటూ ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి తుమ్మలబైలు పాఠశాల ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 5వ తేదీన టీడీపీ నాయకులు పాఠశాల విద్యార్థులను బలవంతంగా ఓ కార్యక్రమానికి పిలిపించి వారితో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయించారు. దీనిపై శనివారం 'తెలుగుదేశం పార్టీకి ఇదేమి ఖర్మ?' శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి శనివారం సాయంత్రం తుమ్మలబైలు పాఠశాలను తనిఖీ చేసి సంఘటనపై విచారించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవితో పాటు ఉపాధ్యాయులనూ ప్రశ్నించారు. పిల్లలు బయటకు వెళ్లేందుకు ఎవరు అనుమతి ఇచ్చారు..వారు వెళ్తుంటే ఎందుకని ప్రశ్నించలేదని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతోనూ మాట్లాడగా, 'మేము రామని చెప్పినా... ఫొటో దిగిపోండి అంతే' అంటూ టీడీపీ నాయకులు తమను తీసుకువెళ్లారని వారు సమాధానం చెప్పారు. పాఠశాల ఆయా లక్ష్మీదేవి సైతం ఆ రోజు అక్కడ ఉందని తెలిసి... విధుల్లో ఉన్న నువ్వు పాఠశాలను వదిలి ఎలా వెళ్లావంటూ మందలించారు. అనంతరం పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్, సభ్యులను పిలిపించి మాట్లాడారు. పాఠశాలకు సంబంధించిన వ్యవహారాలన్నీ గమనిస్తూ ఉండాలని సూచించారు. ఆ రోజు విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ నుంచి రాత పూర్వకంగా వాంగ్మూలం తీసుకున్నారు.


ముగ్గురికి మెమోలు

అనంతరం హెచ్‌ఎం లక్ష్మీదేవితో పాటు ఉపాధ్యాయులు మురాద్ షావలి, విజయకు ఇన్‌చార్జ్ డీఈఓ మెమోలు ఇచ్చారు. ఘటనపై సమగ్ర నివేదికను కలెక్టర్‌కు, ఆర్జేడీకి పంపుతామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు. ఇన్‌చార్జ్ డీఈఓ వెంట కదిరి, గాండ్లపెంట ఎంఈఓలు చెన్నకృష్ణ, కృష్ణానాయక్ ఉన్నారు.


తెల్లారిన జీవితాలు!



మృతుడు గోవిందప్ప



మృతుడు తిమ్మేగౌడ్



ఐచర్ వాహనం బోల్తాపడి చెల్లా చెదురైన ఎరువు బస్తాలు

రెక్కాడితేగానీ డొక్కాడని జీవితాలు వారివి. సువర్ణముఖి తల్లినే నమ్ముకుని బతికే బడుగుజీవులు. రోజులాగే ఇసుక తెచ్చేందుకు ఎద్దులబండిపై తెల్లవారుజామునే ఇంటి నుంచి బయలు దేరిన వారి జీవితాలు... మార్గమధ్యంలోనే తెల్లారిపోయాయి. వెనుకనుంచి మృత్యువులా వచ్చిన ఐచర్ వాహనం ఎద్దుల బండిని ఢీకొనగా ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఈ ఘటన రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది.

- ఎడ్లబండిని ఢీకొన్న ఐచర్ వాహనం
- ఇద్దరు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం
- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు
- ఘటనా స్థలంలోనే రెండు ఎద్దులూ మృతి

మడకశిర(అగళి): అగళి సమీపంలోని 544వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజాము 5 గంటల సమయంలో ఐచర్ వాహనం వేగంగా వచ్చి ఎండ్ల బండిని ఢీ కొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇదే ప్రమాదంలో రెండు ఎద్దులు కూడా మృత్యువాత పడ్డాయి. వివరాల్లోకి వెళితే....అగళి మండలం కసాపురం గ్రామానికి చెందిన తిమ్మేగౌడ్(35), గోవిందప్ప(42) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరు రోజూ సువర్ణముఖి నదికి వెళ్లి ఎద్దులబండిలో ఇసుక నింపేవారు. తద్వారా వచ్చే డబ్బులతో కుటుంబాలను పోషించుకునేవారు. ఈ క్రమంలోనే శనివారం తెల్లవారుజాము కసాపురం గ్రామానికి చెందిన శివన్నతో కలిసి ఎద్దులబండిలో తిమ్మేగౌడ్, గోవిందప్ప సువర్ణముఖి నదికి బయలుదేరారు. అగళి సమీపంలోని జాతీయరహదారిపైకి రాగానే రొళ్ల వైపు నుంచి గొర్రెల ఎరువు లోడుతో వస్తున్న ఐచర్ వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తిమ్మేగౌడ్, గోవిందప్ప అక్కడికక్కడే మృతి చెందారు. శివన్న తీవ్ర గాయంగా గాయపడ్డాడు. రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. గాయపడిన శివన్నను స్థానికులు తుమకూరు ఆస్పత్రికి తరలించారు. అతి వేగంగా వచ్చి ఎద్దులబండిని ఢీ కొన్న ఐచర్ బోల్తా పడగా, వాహనంలోని గొర్రెల ఎరువు బస్తాలు చెల్లా చెదురయ్యాయి. మడకశిర సీఐ సురేష్‌బాబు, స్థానిక ఎస్‌ఐ లావణ్య ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లావణ్య తెలిపారు.

మడకశిర ఆస్పత్రిలో పోస్టుమార్టం..

తిమ్మేగౌడ్, గోవిందప్ప మృతదేహాలను పోలీసులు మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెడికల్ ఆఫీసర్ శశిరేఖ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రమాద ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిమ్మేగౌడ్‌కు వివాహం కాగా, సంతానం లేదు. గోవిందప్పకు భార్య, కుమారుడు ఉన్నారు.

పొగమంచు వల్లే ప్రమాదం!

అగళి మండలంలో కనిష్ట ఉష్ణోగ్రత నమోదవుతుండగా, తెల్లవారుజామున పొగమంచు కమ్మేస్తోంది. శనివారం కూడా పొగమంచు ఎక్కువగా ఉంది. దీంతో రోడ్డుపై ఉన్న ఎద్దుల బండి కనిపించక పోవడం వల్లే ఐచర్ వాహనం డ్రైవర్ వేగంగా వచ్చి ఢీ కొన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఘటన అనంతరం ఐచర్ డ్రైవర్ కనిపించకుండా పోయారు.

క్లుప్తంగా

యువకుడిపై 'పోక్సో' కేసు నమోదు

బత్తలపల్లి: బాలికకు మాయమాటలు చెప్పి లోబరుచుకున్న ఓ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బత్తలపల్లి వడ్డెర కాలనీకి చెందిన ఓ బాలికను బుక్కపట్నం మండలం గసికవారిపల్లికి చెందిన సుంకన్న కుమారుడు డేరంగుల విజయ్ కుమార్ మాయమాటలు చెప్పి డిసెంబర్ 27న తీసుకెళ్లాడన్నారు. జనవరి 6న బాలిక తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. నల్లచెరువు ఎస్‌ఐ వరలక్ష్మీదేవి బాలికను విచారించినట్లు తెలిపారు. ఆమె విచారణ మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిపారు.

రైల్వే లైన్ భూసర్వే అడ్డగింత

గోరంట్ల: పాలసముద్రం సమీపంలోని నాసిన్ అకాడమీని హిందూపురం రైల్వేస్టేషన్‌తో అనుసంధానిస్తూ ఏర్పాటు చేయనున్న రైల్వే లైన్ కోసం శనివారం రెవెన్యూ అధికారులు నిర్వహించిన భూసర్వే ప్రక్రియను పలువురు రైతులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకొన్న తహసీల్దార్ రంగనాయకులు అక్కడికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. ఇప్పటికే నాసిన్, బెల్ పరిశ్రమలకు భూములు ఇచ్చామని రైతులు తెలిపారు. మిగిలిన కొద్దిపాటి భూములనూ సేకరించాలని చూడడం అన్యాయమన్నారు. రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలని పట్టుబట్టారు. ఎకరా పొలానికి రూ. కోటి పరిహారంతో పాటు ఇంటికో ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ అభ్యంతరాలుంటే రైతులు ఉన్నతాధికారులతో మాట్లాడాలని సూచించారు. అయినా రైతులు భూసర్వేకు అడ్డుపడడంతో రెవెన్యూ అధికారులు చేసేదిలేక వెనుదిరిగారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య


పురుషోత్తం (ఫైల్)

ధర్మవరం అర్బన్: ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని రాజేంద్ర నగర్‌లో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. రాజేంద్రనగర్‌కు చెందిన నాయీబ్రాహ్మణుడు పొన్నూరు పురుషోత్తం (40) బార్బర్ షాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని రోజుల క్రితం కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో అనే మనోవేదనతో శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య మాలతి, కుమారుడు ప్రకాష్ ఉన్నారు. టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అమ్మకు అమృతహస్తం!

- గర్భిణులు, బాలింతల సంరక్షణపై సర్కారు ప్రత్యేక దృష్టి
- ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇళ్ల వద్దకే సేవలు
- బలవర్ధకానికి 'వైఎస్సార్ కిట్'
- మాతాశిశు మరణాలపై ఎప్పటికప్పుడు సమీక్ష



నిడిమామిడిలో గర్భిణికి వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: మాతా శిశువుల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అధునాతన వైద్యం, పౌష్టికాహారం అందజేస్తూ నవజాత శిశువులు, గర్భిణులు, బాలింతలను సంరక్షిస్తోంది. అధికారులు ప్రతి నెలా సమీక్షలు జరుపుతూ మాతా శిశు మరణాల నిర్మూలనే లక్ష్యంగా పకడ్బందీగా ముందుకు సాగుతున్నారు.

రెండో నెల నుంచే జాగ్రత్తలు..

గర్భం దాల్చిన రెండో నెలలోనే పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసి మాతా శిశు సంరక్షణ (ఎంసీపీ) కార్డులను అందజేస్తున్నారు. ప్రెగ్నెన్సీ టెస్ట్ నుంచి బరువు, పల్స్‌రేటు, రక్తపోటు, హెచ్‌బీ శాతం, అనీమియా, కాళ్ల వాపులు, రక్త పరీక్ష, షుగర్, బీపీ, హెచ్‌ఐవీ తదితర పరీక్షలను చేసి ఫలితాలను కార్డులో నమోదు చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా ప్రతి వారం పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏఏ కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలి, ఎంత సేపు నిద్రపోవాలి, ఉప్పు శాతం ఎంత తీసుకోవాలి అనే విషయాలపై గర్భం దాల్చిన వారికి అవగాహన కల్పిస్తున్నారు.

వైఎస్సార్ కిట్.. ఎంతో ఫిట్..

గర్భిణిలు అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేసుకున్న నెల నుంచే రోజూ పాలు, గుడ్లతో పాటు ఒక పూట భోజనం అందజేస్తున్నారు. దీంతో పాటు రాగిపిండి, జొన్నపిండి, అటుకులు, బెల్లం, చిక్కీలు, ఖర్జూరాలు తదితర పదార్థాలు ఉన్న వైఎస్సార్ కిట్ పంపిణీ చేస్తున్నారు. బాలింతలకు రెండున్నర కిలోల పిండి ఉండే బాలామృతం ఇస్తున్నారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన కింద ప్రతి గర్భిణికి మూడు విడతలుగా రూ.5 వేలు, జననీ సురక్ష యోజన కింద ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు అయిన వారిలో గ్రామీణ ప్రాంతాలైతే రూ.1,000, పట్టణ ప్రాంతమైతే రూ.600, ఇంటి వద్ద అయితే రూ.500 అందజేస్తున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇళ్ల వద్దే సేవలు..

గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వం వైద్య సేవలు తీసుకెళ్లింది. ల్యాబ్ పరీక్షలు సైతం గ్రామాల్లోనే చేసేలా చర్యలు తీసుకుంది. మందులనూ ఉచితంగా అందజేస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల కిల్ కారీ అనే విధానాన్ని తీసుకొచ్చింది. గర్భం దాల్చిన నాల్గవ నెల నుంచి బిడ్డ పుట్టిన తర్వాత 12 నెలల వరకూ వాయిస్ మెసేజ్ ద్వారా తల్లీబిడ్డ పాటించాల్సిన జాగ్రత్తలు తెలియజేయడమే దీని ఉద్దేశం. ఎప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలి, ఎలాంటి ఆహార నియమాలు పాటించాలి తదితర విషయాలు 72 సార్లు వాయిస్ మెసేజ్ రూపంలో ఈ విధానంలో పంపుతారు.

పర్యవేక్షణ బాగుంది



గర్భిణుల ఆరోగ్య విషయంలో ప్రభుత్వ వైద్యాధికారుల పర్యవేక్షణ బాగుంది. ప్రతి గురువారం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆహారం, మందుల వాడకంపై జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా గ్రామానికే వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇటీవల కిల్‌కారీ విధానంలో వాయిస్ రికార్డు ద్వారా వైద్య సలహాలు ఇస్తామని చెప్పారు. చాలా సంతోషంగా ఉంది.

– నందిని, గర్భిణి, పెదపల్లి, పుట్టపర్తి మండలం

వైద్య సేవల్లో పొరపాట్లకు తావు లేదు



ప్రభుత్వాస్పత్రుల్లో సుశిక్షితులైన వైద్యులు ఉంటారు. సులభంగా కాన్పులు చేస్తారు. కొంత మంది చెప్పుడు మాటలు నమ్మి ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వేలకు వేలు ఖర్చు చేసుకుంటున్నారు. డబ్బు ఖర్చు పెట్టినా ఒక్కోసారి నిర్లక్ష్యపు వైద్యంతో ప్రాణాలు పోయే పరిస్థితి. ఇలాంటి వాటిని పారద్రోలడమే లక్ష్యంగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. మాతాశిశుమరణాలపై ప్రతి నెలా సమీక్షలు జరుపుతూ కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. వైద్య సేవలు, ఆహార నియమాల్లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సేవలందిస్తున్నాం.

– ఎస్వీ కృష్ణారెడ్డి, డీఎంహెచ్‌ఓ

ప్రమాదవశాత్తూ బావిలో పడి వివాహిత మృతి


భాగ్యమ్మ మృతదేహం

గుడిబండ: ప్రమాదవశాత్తూ బావిలో పడి వివాహిత మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కూగీరనపాళ్యంలో శనివారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన మేరకు.. కూగీరనపాళ్యం గ్రామానికి చెందిన రాజు భార్య భాగ్యమ్మ (28) శనివారం కట్టెల కోసం వెళ్లింది. చెప్పులకు మట్టి అంటడంతో కడుక్కోవడానికి సమీపంలోని బావిలో దిగింది. ప్రమాదవశాత్తూ నీళ్లలో పడిపోయింది. ఆమె వెంటే ఉన్న కుమార్తె పవిత్ర పరుగున వచ్చి గ్రామస్తులకు తెలపగా.. వారు వెళ్లి చూసే సరికే భాగ్యమ్మ నీళ్లలో విగత జీవిగా కనిపించింది. మృతురాలి తల్లి హనుమక్క ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

9న జిల్లా హాకీ జట్ల ఎంపిక

ధర్మవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 9వ తేదీ ఉదయం జిల్లా బాలుర, మహిళా హాకీ జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ బాలుర జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 14 నుంచి మూడు రోజులపాటు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో, మహిళల జట్టుకు ఎంపికయ్యేవారు ఈనెల 11 నుంచి మూడురోజులపాటు ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

విజిలెన్స్ మెరుపు దాడులు

- 146 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అక్రమంగా తరలిస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శనివారం మెరుపుదాడి చేసి పట్టుకున్నారు. కర్నూలు జిల్లా నుంచి ఐషర్ వాహనంలో కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 146 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అనంతపురం శివారులోని గోపాల్ ధాబా వద్ద విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం ధూపంపల్లికి చెందిన పి.నరసింహారెడ్డి, ధర్మవరానికి చెందిన వాహన యజమాని చీమల రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకుని త్రీటౌన్ పోలీసులకు అప్పగించినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి తెలిపారు. కర్నూలు జిల్లా బైరాపురం ప్రాంతం నుంచి కార్డుదారుల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం సేకరించి కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించాలనే ఉద్దేశంతో తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.


విజిలెన్స్ అధికారులు పట్టుకున్న బియ్యం

అక్రమ బియ్యం నిల్వలు సీజ్

గార్లదిన్నె: కార్డుదారుల నుంచి తక్కువ ధరకు సేకరించిన 128 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గార్లదిన్నె మండలం శిరివరం పొలాల్లో అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో శనివారం దాడి చేసి పట్టుకున్నామని విజిలెన్స్ ఎస్‌ఐ ఫణీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఈ బియ్యాన్ని చిక్‌బళ్లాపూర్‌కు తరలిస్తున్నట్లు తేలిందన్నారు. బియ్యాన్ని సీజ్ చేసి ఆత్మకూరు సివిల్ సప్లయ్ స్టాక్‌పాయింట్‌కు తరలించామన్నారు. ఈ కేసులో కల్లూరుకు చెందిన గుజ్జల రామాంజనేయులును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. సీఎస్‌డీటీ ధనలక్ష్మి, విజిలెన్స్ ఇంజినీర్ రవీంద్రనాథ్, మహేష్‌రెడ్డి, మనోహర్, వీఆర్‌ఓ మమత, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో నిఘా పెంచండి


ఎస్పీకి స్వాగతం పలుకుతున్న పోలీసులు

మడకశిర: సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచాలని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ పోలీసులను ఆదేశించారు. శనివారం రాత్రి ఆయన మడకశిర పోలీస్ సర్కిల్ కార్యాలయం, మడకశిర పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని ఐదు మండలాల పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల వివరాలపై సమీక్షించారు. పలు ప్రధాన కేసుల వివరాలు, దర్యాప్తు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. నేరాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. అంతకుముందు పెనుకొండ డీఎస్పీ హుసేన్‌పీరా, సీఐ సురేష్‌బాబు, ఎస్‌ఐ నాగేంద్ర ఎస్పీకి స్వాగతం పలికారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు, ఆలయాల్లో చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని అనంతపురం మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.4.60 లక్షల విలువైన నాలుగు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను శనివారం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కత్తి శ్రీనివాసులు వెల్లడించారు.

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని రేగాటిపల్లి సర్కిల్‌లో నివాసం ఉంటున్న పఠాన్ మన్సూర్‌ఖాన్ భవన నిర్మాణ కార్మికుడిగా సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాగుడు, గంజాయి లాంటి చెడు వ్యసనాలకు బానిస. సెంట్రింగ్ పనితో వచ్చే డబ్బు తన వ్యసనాలు తీర్చుకునేందుకు సరిపోకపోవడంతో చోరీలకు పాల్పడేవాడు. రాత్రి సమయంలో తలుపులు వేసిన ఆలయాలు, దుకాణాల్లో చొరబడి విలువైన సామగ్రి అపహరించుకెళ్లేవాడు. గతంలో ధర్మవరం, అనంతపురము వన్‌టౌన్; కొత్తచెరువు, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో చోరీలు చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా అతనిలో మార్పు రాలేదు. పైగా మారు తాళం ఉపయోగించి ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లడం మొదలు పెట్టాడు. తాజాగా అనంతపురం నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్‌తో పాటు శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డాడు. కేసుల దర్యాప్తులో భాగంగా పక్కా ఆధారాలతో నిందితుడు మన్సూర్‌ఖాన్‌ను గుర్తించి శనివారం అరెస్ట్ చేశారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన ఎస్‌ఐ వలిబాషా, సిబ్బందిని ఎస్పీ ఫక్కీరప్ప, ఇన్‌చార్జ్ డీఎస్పీ మహబూబ్‌బాషా అభినందించారు.


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ముస్లింల వ్యవహారాల్లో జోక్యం తగదు


మాట్లాడుతున్న ముతవల్లి ముస్తాక్ అహ్మద్

ధర్మవరం: ముస్లింల వ్యవహారాల్లో రాజకీయ నాయకుల జోక్యం తగదని ముస్లిం మతపెద్దలు తెలిపారు. శనివారం స్థానిక పీఆర్‌టీ వీధిలో ఉన్న షాదీమహల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జామియా మసీదు ముతవల్లి ముస్తాక్ అహ్మద్, మదీనా మసీదు ముతవల్లి జాకీర్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు స్టార్ ఖలీల్ మాట్లాడారు. ఇందిరానగర్‌లో ఉన్న కబరస్థాన్ పునర్ నిర్మాణం పవిత్ర కార్యమని పేర్కొన్నారు. మతపెద్దల అందరి ఆమోదంతో తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేశారు. ఏవైనా మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు ఉంటే స్వీకరించి సమష్టిగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ విషయంలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడం బాధ కల్గించిందన్నారు. పురాతనమైన కబరస్థాన్‌లో 8 ఏళ్లుగా మురుగునీటి సమస్య నెలకొందన్నారు. సమాధులు నీటి ఊటతో శిథిలావస్థకు చేరాయని, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నా ఫలితం కనిపించలేదన్నారు. ఈ క్రమంలోనే జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 40 మసీదుల మతవల్లిల ఆమోదంతో పునర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఇది పూర్తిగా ముస్లింల అంతర్గత వ్యవహారమని, ఇందులో పార్టీల నాయకులు చొరబడడం బాధాకరమన్నారు. ముస్లింల ఐక్యతకు భంగం వాటిల్లేలా వ్యవహరించవద్దని హితవు పలికారు. ఇంతటితో ఈ విషయాన్ని వదిలేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మైనార్టీ నాయకులు ఎస్పీ బాష, చాంద్ బాష, సుభాన్, ఇర్ఫాన్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


గాయపడిన చంద్ర


గణేష్


మృతి చెందిన సోము

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్ జిల్లాలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పుట్టపర్తివాసి ఒకరు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వారి బంధువులు తెలిపిన మేరకు.. పుట్టపర్తి మున్సిపాలిటీ రెండో వార్డుకు చెందిన సోము (36), చంద్ర (30), గణేష్ (25)లు ఇటీవల శబరిమల యాత్రకు వెళ్లివచ్చారు. ప్రసాదం పంచేందుకు శనివారం ఉదయం వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురంలో ఉన్న బంధువుల ఇంటికి బైకుపై వెళ్లారు. తిరుగుప్రయాణంలో సింహాద్రిపురం వద్ద వీరి బైకును ఓ కారు ఢీకొంది. తీవ్ర గాయాలైన సోము (36) అక్కడిక్కడే మృతి చెందాడు. గాయాలైన చంద్ర, గణేష్‌ను పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలియగానే సోము కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతునికి ఇద్దరు కుమార్తెలున్నట్లు తెలిసింది.

'పురం'లో బంగారు దుకాణాల మూత

- కర్ణాటక పోలీసులు విచారణ పేరుతో వేధిస్తున్నారంటూ ఆవేదన

హిందూపురం: కర్ణాటక పోలీసులు విచారణ పేరుతో తమను వేధిస్తున్నారంటూ పట్టణానికి చెందిన పలువురు బంగారు దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు. మైసూరులో పట్టుబడిన కొందరు దొంగలు.. తాము కొట్టేసిన నగలను హిందూపురంలో విక్రయించామని తెలపడంతో శనివారం కర్ణాటక పోలీసులు తనిఖీలు చేపట్టేందుకు ఇక్కడికి వచ్చినట్లు తెలిసింది. ముందుగానే విషయం తెలుసుకున్న మెయిన్‌బజారులోని వ్యాపారులు దుకాణాలు మూసివేసి వెళ్లిపోయారు. కర్ణాటక పోలీసులు ప్రతిసారీ ఇక్కడకు వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు వాపోయారు. సాయంత్రం వరకూ దుకాణాలు తెరవకపోవడంతో చేసేదిలేక కర్ణాటక పోలీసులు వెనుదిరిగారు.


మెయిన్‌బజారులో బంగారుషాపులు మూసివేసిన దృశ్యం